క్లుప్తంగా

ఈవోకు సన్మానం



ఈవో రమాదేవిని సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం బాధ్యులు

వేములవాడ: ఆలయ ఈవోగా రమాదేవి బాధ్యతలు చేపట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు కూరగాయల శ్రీనివాస్, ఏఈవోలు శ్రవణ్, జయకుమారి, అశోక్, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

8న అనంతగిరి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి పోచమ్మ ఆలయం ఆరో వార్షికోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొలిపురి అంతగిరి తెలిపారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మహా చండీహోమం, రుద్రహోమం, మహాశక్తి యాగం, పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ఈవో మారుతీరావు, జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న ఉద్యోగులు

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ ఉద్యోగులు రూ.20వేల విలువగల కలర్ ప్రింటర్‌ను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ, సర్కార్ బడుల్లో ఉచిత విద్యుత్, మూత్రశాలలు, స్కావెంజర్, ఆధునిక తరగతులవంటి సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని, ప్రభుత్వ పరిధిలో లేని అవసరాలను తాము తీరుస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు గజ్జెల ప్రశాంత్, న్యాత రాజశేఖర్, ఉపాధ్యాయులు కూలేరి ప్రేమ్‌సాగర్, రవినాయక్, మంజుల, కవిత పాల్గొన్నారు.

సరిపడా యూరియా అందించాలి



యూరియా కోసం వేచి ఉన్న రైతులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట రైతు వేదిక వద్ద శనివారం రైతులు యూరియా కోసం నిరీక్షించారు. 400 బస్తాల యూరియా వచ్చిందని తెలియగానే ఉదయమే రైతువేదిక వద్ద బారులు తీరారు. ఒక్కో బస్తా చొప్పున రైతులకు అందజేశారు. కొందరికి దొరక్కపోడంతో ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా యూరియా అందించాలని కోరారు. రైతులందరికీ సరిపడా యూరియా వస్తుందని మండల వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు.

పీఆర్సీ అమలు చేయాలి



సభ్యత్వ నమోదులో ఎస్టీయూ బాధ్యులు

బోయినపల్లి: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మొగిలి లక్ష్మణ్ కోరారు. శనివారం మండలంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. 2023లో ఇవ్వాల్సిన పీఆర్సీ ఇంతవరకు ఇవ్వలేదని, మరో పీఆర్సీ గడువు సమీపించేలా ఉందని తెలిపారు. అలాగే మండలంలోని నర్సింగాపూర్ హైస్కూల్‌లో ఎస్టీయూ మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎర్రోజు రాంచంద్రం, ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణమూర్తి, కోశాధికారి రఘు, ఆర్థికశాఖ సభ్యులు పి.మహేశ్వరి, ఫహీమ్‌బాను, ఉపాధ్యక్షులు నరేందర్‌రావు, ఉపాధ్యక్షురాలు సుజాత, జిల్లా కార్యదర్శులు టి.అంజయ్య, మల్లేశం, మండల కార్యదర్శులు జి.గురుదేవ్, రాజశేఖర్, పి.గిరిజ, ఎ.రాధికను ఎన్నుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వేములవాడరూరల్: పట్టణంలోని శాత్రాజుపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె.లావణ్య తెలిపారు. సంబంధిత పీజీలో 50 శాతం మార్కుల ఉత్తీర్ణతతో పాటు నెట్, సెట్ లేదా పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని, ఈ నెల 9న 10 గంటలకు ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

వెళ్లి రావయ్యా.. బొజ్జ గణపయ్యా



వినాయకుడితో చిన్నారులు



సిరిసిల్లలో నిమజ్జనోత్సవాల్లో భక్తులు



కోనరావుపేట: బావుసాయిపేటలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



గణపతి విగ్రహంతో మహిళ

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. శనివారం డప్పు చప్పుళ్లు.. మహిళల కోలాటం.. ఒగ్గుడోలు విన్యాసాలు.. గణపతి బొప్పా మోరియా, జై బోలో గణేశ్ మహరాజ్‌కీ నినాదాలు.. యువత సందడి మధ్య గణపతి విగ్రహాలను శోభాయాత్రగా తీసుకెళ్లి చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

– సిరిసిల్ల అర్బన్/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/తంగళ్లపల్లి



జిల్లాకేంద్రంలో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య



ముస్తాబాద్: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



ఎల్లారెడ్డిపేట: నిమజ్జన ప్రాంతం వద్ద గణనాథులు



సిరిసిల్లఅర్బన్: బీవైనగర్‌లో మహిళల పూజలు



ఎల్లారెడ్డిపేట: పోలీసుల బందోబస్తు



సిరిసిల్లలో యువకుల సందడి



తంగళ్లపల్లిలో..

సిడ్నీలో వినాయక ఉత్సవాలు



సిరిసిల్లటౌన్: ఆస్ట్రేలియా, తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిడ్నీలో వినాయక నవరాత్రి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దూపాటి రవి, సభ్యులు రాపోలు రాజేశ్, సుతారి మధు, సుతారి శ్రీనివాస్, నార్మెట్ రాజ్‌కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో ప్రవాసీయులు

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తేనే పేదకుటుంబాలు ఆర్థికంగా స్థిరపడుతాయని డాక్టర్ బీఎస్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని విద్యానగర్ మహిళా కమ్యూనిటీ హాల్‌లో శనివారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(న్యాక్) కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాక్ సంస్థ దశాబ్దకాలంగా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తూ అండగా నిలుస్తుందన్నారు. న్యాక్‌తో కలిసి డాక్టర్ బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ పని చేస్తుందని వివరించారు. 20 మంది మహిళలకు నెలరోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తున్నామని, శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేసి ఉపాధి సాధించే దిశగా అడుగులు వేయాలని కోరారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేశ్ మాట్లాడుతూ, మహిళలను స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించే లక్ష్యంతో న్యాక్ సంస్థ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఎస్ రావు ఫౌండేషన్ కార్యదర్శి ఝాన్సీ, శ్రీదేవి, గంగ, న్యాక్ సిబ్బంది ప్రకాశ్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రం

సిరిసిల్లఅర్బన్: మాలలకు అన్యాయం జరిగే జీవో నంబర్ 99ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 8న నిర్వహించే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి రొడ్డ రామచంద్రం కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. రాష్ట్రంలోని మాల, మాల ఉపకులాలకు జీవో నంబర్ 99 ద్వారా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మాల, ఉపకులాల వారు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, నాయకులు నాలుక సత్యం, ఎడ్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

8న కలెక్టరేట్‌కు తరలిరావాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

సిరిసిల్లఅర్బన్: కలెక్టరేట్ వద్ద ఈ నెల 8న చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ కోరారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, బీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వికలాంగులు, బీడీ కార్మికులు, వితంతువులు, గీతకార్మికులు, నేత కార్మికులకు ఇస్తానన్న పెన్షన్ పెంపును కోరుతూ నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బడుగు లింగయ్య, శోభారాణి, శిరీష, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి



మధుసూదన్‌రావు (ఫైల్)

కోనరావుపేట: మండలంలోని సుద్దాల గ్రామ కారోబార్ బోయినిపల్లి మధుసూదన్‌రావు (90) శనివారం వేకువజామున మృతిచెందారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గ్రామస్తులకు దేవయ్య సార్‌గానే పరిచయం. ఆయన మృతి పట్ల విప్ ఆది శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, ఎరవెల్లి నాగరాజు తదితరులు సానుభూతి వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం



అంధకారంలో గాంధీ సర్కిల్

సిరిసిల్లకల్చరల్: వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగుతుండగానే శనివారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గాంధీనగర్ లేబర్‌అడ్డా వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనాన్ని ఫైరింజన్ సహాయంతో పూర్తి చేశారు. ఈక్రమంలో ఏమైనా ప్రమాదం జరుగుతుందని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇదే సమయంలో హిందూ ఉత్సవ సమితి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో చాలా మంది భక్తులు నిరుత్సాహపడడం కనిపించింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

వీర్నపల్లి: మండలంలోని కంచర్ల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..వీర్నపల్లికి చెందిన భూత వినోద్ బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వెళ్తుండగా, ఎల్లారెడ్డిపేట నుంచి మద్దిమల్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వీర్నపల్లి–కంచర్ల మూలమలుపు వద్ద ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. కాగా, రోడ్డు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జూలై 3న 'సాక్షి'లో 'ఏపుగా చెట్లు..వాహపదారుల పాట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

ముస్తాబాద్: ముసాయిదా ఓటరు జాబితాను ఎంపీడీవో లచ్చాలు శనివారం విడుదల చేశారు. వీటిపై ఎవరికైన అభ్యంతరాలుంటే ఈనెల 8వరకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని ముసాయిదా జాబితాను ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం విడుదల చేశారు. 10న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు.

బోయినపల్లి: మండలంలోని 11 ఎంపీటీసీల ముసాయిదా ప్రతిని ఎంపీడీవో భీమా జయశీల విడుదల చేశారు. ఓటర్ల జాబితాపై 8 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు.

చిన్నబోతున్న 'సన్న' రైతులు

- సన్నాలకు బోనస్ ఎప్పుడో..
- మూడునెలలుగా ఎదురుచూపులు



నిమ్మపల్లిలో సన్నవడ్ల కొనుగోళ్లు(ఫైల్)

కోనరావుపేట: సన్న రకం ధాన్యం బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యం విక్రయించి మూడునెలలు అవుతున్నా ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఖాతాల్లో బోనస్ జమకాక పెట్టుబడుల కోసం ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావాణిలో వినతి

రేషన్‌దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సన్నరకం వరిపంట సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. దానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కనీసమద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తానని హామీ ఇచ్చింది. దీంతో రైతులు సన్న వడ్ల సాగుపై ఆసక్తి చూపారు. కానీ, బోనస్ ఇవ్వడంలో జాప్యం చేస్తుండడంతో తమకు డబ్బులు ఇప్పించాలని పలువురు ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు.

రైతన్నల ఎదురుచూపులు

గత రబీలో మండలవ్యాప్తంగా మహిళా సంఘాలు, సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు వడ్లతో పాటు సన్న రకం వడ్లు కూడా కొనుగోలు చేశారు. మండలవ్యాప్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో 10,120 క్వింటాళ్ల ధాన్యాన్ని 218 మంది రైతుల వద్ద కొన్నారు. కోనరావుపేట సింగిల్‌విండో పరిధిలో 160 మంది రైతుల వద్ద 11,059 క్వింటాళ్లు, కొలనూర్ విండో ద్వారా 9 మంది రైతుల వద్ద 320 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయి మూడునెలలు కావస్తున్నా బోనస్ డబ్బులు అందకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారు. వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నారు.

బోనస్ డబ్బులు ఇప్పించాలి



ప్రభుత్వంపై నమ్మకంతో కోనరావుపేట గ్రామంలోని దాదాపు 100 మంది రైతులం సన్నవడ్లు సాగు చేశాం. నాకున్న ఐదున్నర ఎకరాల్లో 168 క్వింటాళ్ల ధాన్యం పండించి కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ఖరీఫ్ పంట పెట్టుబడులకు అప్పు చేసే పరిస్థితి ఏర్పడింది. బోనస్ డబ్బులు ఇప్పించాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం.

– యాస రాజం, రైతు, కోనరావుపేట

రైతులను ఆదుకోవాలి



24 క్వింటాళ్ల సన్న వడ్లు కొనుగోలు కేంద్రంలో విక్రయించా. ధాన్యం డబ్బులు వచ్చాయి కానీ, బోనస్ డబ్బులు రాలేదు. మూడునెలలుగా ఎదురుచూస్తున్నా. వెంటనే బోనస్ డబ్బులు అందించి రైతులను ఆదుకోవాలి.

– కాసర్ల మల్లారెడ్డి, రైతు, కనగర్తి

అనంత పద్మనాభస్వామికి పూజలు



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో అనంత పద్మనాభస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు అనంత కోటి దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డెక్కిన వారసంత



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో వారసంతను మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేశారు. ప్రతీ శనివారం వారసంతను గొల్లపల్లి బస్టాండ్ నుంచి రాజన్నపేటకు వెళ్లేదారిలో నిర్వహిస్తారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మార్కెట్‌ను సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారిపై నిర్వహించగా వాహనదారులతో పాటు సంతకు వచ్చేవారు ఇబ్బందిపడ్డారు.

కమ్యూనిటీ భవనాలకు నిధులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కుల సంఘ భవనాలకు ఎంపీ నిధులు రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి తెలిపారు. బండలింగంపల్లి, వెంకటాపూర్, రాచర్లబొప్పాపూర్, రాజన్నపేట గ్రామాల్లోని వివిధ కుల సంఘాల భవనాలకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బోయినపల్లి మండలంలో..

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం భవనం మిగులు పనులకు రూ.5 లక్షలు, మాల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ గుడి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. జాతీయస్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థినులకు శనివారం మండలంలోని రాచర్లగొల్లపల్లిలో డ్రెస్‌కోడ్, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను నేతాజీ యూత్ సేవా సమితి సభ్యులు సమకూర్చగా శనివారం ఎంఈవో పంపిణీ చేశారు. సమితి అధ్యక్షుడు చెట్కూరి దినేశ్‌గౌడ్, మారవేణి రంజిత్‌కుమార్, పొన్నాల వెంకటేశ్, చిందు శ్రీనివాస్, అజ్మీరా విశ్వనాథ్, మిర్యాల్‌కర్, మణికంఠ, శ్రీగాథ, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం

వేములవాడ: రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో ఈనెల 8న ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, కంటి ఆపరేషన్ చేయించుకోవాలనుకునే వారు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, రూ.220 రక్తపరీక్ష కు చెల్లించాల్సి ఉంటుందన్నారు. తినేందుకు ఒక ప్లేట్, గ్లాస్, రెండు దుప్పట్లు వెంట తెచ్చుకోవాలని, పేషెంట్‌కు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. తామే బస్సులో తీసుకువెళ్లి, ఆపరేషన్ తర్వాత మళ్లీ వేములవాడకు తీసుకుని వస్తామని వివరించారు. ఆపరేషన్ తర్వాత ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు డాక్టర్ సంతోష్‌కుమార్ (90003 02223), లయన్ బచ్చు వంశీకృష్ణ (91776 81744), లయన్ డాక్టర్ కోయినేని ప్రవీణ్‌ను (97044 28009) నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి హెచ్‌ఎంగా పని చేస్తున్న పీచు సుభాశ్‌రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. శనివారం ఆయనను విద్యార్థులు, పాఠశాల సిబ్బంది సన్మానించారు.